• మేడం.. మీరెళ్లొద్దు



టీచర్ బదిలీపై వేరే పాఠశాలకు వెళ్తుండగా.. వెళ్లొద్దు టీచర్ అంటూ విద్యార్థులు వెక్కివెక్కి ఏడ్చారు. ఈ ఘటన గురువారం మెదక్ జిల్లా చేగుంట మండలం చెట్లతిమ్మాయిపల్లి పాఠశాలలో చోటుచేసుకున్నది. చెట్ల తిమ్మాయిపల్లి పాఠశాలలో రజిత అనే టీచర్ 12 ఏండ్లుగా పనిచేస్తున్నారు. తాజాగా ఆమె వెల్దుర్తి మండలం బొమ్మారం పాఠశాలకు బదిలీ అయ్యారు. గురువారం ఆమె పాఠశాల నుంచి రిలీవ్ అయి వెళ్తుండగా విద్యార్థులు వెళ్లొద్దంటూ కన్నీరు కార్చారు. విద్యార్థులను చూసి టీచర్ సైతం కారులో కన్నీరు పెట్టుకోవడం అందరినీ కదిలించింది.

• రోడ్డెక్కిన గురుకుల విద్యార్థినులు



తమను ఇబ్బందిపెడుతున్న ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని సూర్యాపేట జిల్లా కేంద్రం సమీపంలోని బాలెంల సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు సూర్యాపేట - జనగామ రహదారిపై గురువారం బైఠాయించారు. పలువురు విద్యార్థినులు మాట్లాడుతూ ప్రిన్సిపాల్ శైలజ తమపట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారని, భోజనం సరిగ్గా పెట్టడం లేదని, ప్రశ్నిస్తే చేయి చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. సాంఘిక సంక్షేమ గురుకులాల రీజినల్ కోఆర్డినేటర్ అరుణకుమారి చేరుకొని విచారణ చేపట్టి, తగిన చర్యలు తీసుకుంటామని హామీనిచ్చి ఆందోళన విరమింపజేశారు.



## రాష్ట్రంలో ముస్లిం వ్యతిరేక ప్రభుత్వం

- మైనార్టీ డిక్లరేషన్‌లో ఒక్కటీ అమలుకాలే
- మైనార్టీ గురుకులాలను ఎత్తేసే కుట్ర
- బీఆర్‌ఎస్ మైనార్టీ నేత ఇంతియాజ్ మండిపాటు

హైదరాబాద్, జూలై 4 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో ముస్లిం వ్యతిరేక ప్రభుత్వం ఉన్నదని బీఆర్‌ఎస్ మైనార్టీ విభాగం నేత ఇంతియాజ్ విమర్శించారు. మైనార్టీ విద్యార్థుల ఉన్నత చదువుల కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం గురుకులాలు ఏర్పాటు చేస్తే వాటిని ఎత్తేసేందుకు కాంగెస్ ప్రభుత్వం కుట్రలు మొదలుపెట్టిందని ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్ నేతలు బైకాని శ్రీనివాస్ యాదవ్, మహమ్మద్ అలీ దానిష్‌తో కలిసి గురువారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. మైనార్టీ డిక్లరేషన్‌లో ఒక్క పథకం కూడా అమలు చేయలేదని, ఒక్క పదవి కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. ముస్లింల కోసం నిధులు కూడా విడుదల చేయడం లేదని, ఇవన్నీ చూస్తున్న ముస్లిం మేధావులు ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. ఎన్నికల్లో ముస్లింల ఓట్లు వేయించుకొని ఇప్పుడు పట్టించుకోకపోవడంపై ఎందుకు అడగడం లేదని నిలదీశారు. హజ్‌యాత్రకు కూడా కనీస సౌకర్యాలు కల్పించడం లేదని చెప్పారు. మైనార్టీ సబ్‌ప్లాన్ ఎప్పుడు పెడుతారని, కుట్టుమిషన్లు ఎప్పుడిస్తారని, 100 శాతం సబ్సిడీ డబ్బు ఎప్పుడు పంపిణీ చేస్తారని ప్రశ్నించారు. ఎంఫిల్ చేసిన వారికి 5 లక్షలు ఇస్తామని చెప్పారని, అసలు ఎంఫిల్‌ను ఎప్పుడో తీసేశారని, కనీస అవగాహన లేకుండా ముస్లిం డిక్లరేషన్‌లో పెట్టారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఏడునెలలవుతున్నా ఇప్పటివరకు మైనార్టీల సంక్షేమం కోసం ఒక్క సమీక్ష కూడా చేయలేదని చెప్పారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం మైనార్టీల అభ్యున్నతికి పెద్దపీట వేసిందని, కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 100 శాతం సబ్సిడీ కింద లక్ష రూపాయలు, మహిళలకు కుట్టు మిషన్లు అందించారని గుర్తుచేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇచ్చిన సబ్సిడీ డబ్బులు కలెక్టర్ల ఖాతాలో ఉన్నాయని, వాటిని ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. కుట్టు మిషన్లపై కేసీఆర్ ఫొటో ఉన్నదనే కారణంతోనే పంపిణీ చేయడం లేదని ఆరోపించారు.

# పార్టీ మారినందుకే రాజీనామా చేశా

- పదవిలో కొనసాగడం నేరం.. అనైతికం
- నేను చట్టాన్ని గౌరవించే మనిషిని
- వాళ్ల సంగతి వాళ్లే తేల్చుకోవాలె
- నాకు మరోసారి అవకాశం ఇస్తదా? ఇవ్వదా? అనేది కాంగ్రెస్ తేల్చుకుంటది
- ఎంపీ పదవికి రాజీనామా అనంతరం 'నమస్తే తెలంగాణ' ఇంటర్వ్యూలో కేకే



నమస్తే తెలంగాణ ప్రత్యేక ఇంటర్వ్యూ

హైదరాబాద్, జూలై 4 (నమస్తే తెలంగాణ): 'బీఆర్‌ఎస్ పార్టీ టికెట్‌పై రాజ్యసభకు ఎన్నికయ్యా. ఇప్పుడు కాంగ్రెస్‌లో చేరిన. బీఆర్‌ఎస్ తరఫున గెలిచిన నేను కాంగ్రెస్‌లోనే కొనసాగుతానంటే పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం ఒప్పుకోదు. అలా కొనసాగడం చట్ట ప్రకారం నేరం. అనైతికం. కాబట్టి, బీఆర్‌ఎస్ ద్వారా సంక్రమించిన ఎంపీ పదవికి రాజీనామా చేసిన' అని రాజ్యసభ సభ్యుడు కే కేశవరావు స్పష్టంచేశారు. తాను చట్టాన్ని గౌరవించే మనిషినని చెప్పారు. తనపై రాజ్యసభలో బీఆర్‌ఎస్ సభ్యులు 'సభ్యత్వం రద్దు చేయాలి' అని కోరకపోయినా మరో పార్టీలో చేరిన తరువాత కొనసాగడం అనైతికం అనిపించిందని, అందుకే రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశానని వివరించారు. రాజీనామా అనంతరం ఆయన 'నమస్తే తెలంగాణ'కు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

**మీ రాజీనామాకు కారణం?**

రాజ్యసభకు పంపిన బీఆర్‌ఎస్ పార్టీలో నేను ఇవ్వాళ లేను. కాంగ్రెస్‌లో చేరిన. ఒక పార్టీ టికెట్‌పై గెలిచి మరో పార్టీలో చేరతా.. కొనసాగుతా.. అంటే పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం ఒప్పుకోదు. అలా కొనసాగడం చట్ట ప్రకారం నేరం. అందుకే రాజీనామా చేసిన.

**రాజ్యసభ చైర్మన్‌కు గానీ, పార్లమెంట్ సెక్రటరీ జనరల్‌కు కానీ మీ సభ్యత్వాన్ని రద్దు చేయాలని బీఆర్‌ఎస్ పార్టీ ఫిర్యాదు కూడా చేసినట్టు లేదు కదా?**

ఫిర్యాదు చేశారా? చేయలేదా? అనేది నాకు ముఖ్యం కాదు. నన్ను పార్లమెంట్‌కు పంపిన పార్టీలో ఇప్పుడు లేను. దట్స్ ఆల్. అది నాకు ముఖ్యం. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం ఏం చెప్తున్నది? ఒక పార్టీలో గెలిచి మరో పార్టీలోకి వెళ్లొద్దని చెప్పిందా ? లేదా? అది ముఖ్యం నాకు. లీగల్లీ, మోరల్లీ (చట్టపరంగా... నైతికంగా) నా మీద ఎవరో ఫిర్యాదు చేయాలె.. ఆ తరువాత కోర్టుకు వెళ్లాలె.. అక్కడ కొట్లాడాలె...ఇవన్నీ కాదు. నిన్న (బుధవారం) కాంగ్రెస్‌లో చేరిన. ఇవ్వాళ రాజ్యసభ చైర్మన్‌ను కలిసిన రాజీనామా చేసిన.

**రెన్యువల్ కోసమే రాజీనామా చేశారనే వాదన వినిపిస్తున్నది. దీనికి మీ కామెంట్?**

రెన్యువల్ ఇస్తరా? ఇయ్యరా? ఇస్తే ఏమొస్తది. రాకపోతే ఏంపోతది? ఇది కాదు నాకు ముఖ్యం. చెప్పిన కదా యాంటీ డిఫెక్షన్ లా ప్రకారం మారడం తప్పు. 'రాజీనామా చేయ్.. రాజీనామా చెయ్' అని అందరూ అంటున్నా.. 'నేను అందులోనే ఉంటాను' అంటే చట్టం ఒప్పుకుంటుందా? అందుకే నా రాజీనామా. ఇక రెన్యువల్ చేస్తదో... చేయదో పార్టీ తేల్చుకుంటది. ఐయాం నాట్ సపోస్ టు సే వాట్ మై పార్టీ విల్ డూ ఫర్ మీ. బీ కాస్ యూ ఆర్ నాట్ పార్టీ.

**ఎలాంటి ఫిర్యాదు చేయకపోయినా మీరు రాజీనామా చేశారు. కానీ, రాష్ట్రంలో బీఆర్‌ఎస్ టికెట్‌పై గెలిచిన ఆరుగురు ఎమ్మెల్యేలు ఫిర్యాదు చేసినా స్పందన లేదు. అంటే చట్టం మీకొకటి.. వారికొకటా?**

అసెంబ్లీ, పార్లమెంట్ రెండూ చట్టాలను చేస్తాయి. పార్లమెంట్ చేసే చట్టాలను దేశమంతా ఒకేరీతిగా అమలు చేయాలని చట్టం చెప్తున్నది. నా రాజీనామా గురించి మీరు అడిగారు చెప్పిన. చట్టం ఏం చెప్తున్నది? పార్టీ ఏం చెప్తున్నది? చివరికి ఏది నిలబడుతుంది? అన్నది వాళ్లే తేల్చుకోవాలి నేను కాదు.

**పార్టీ మారిన ఎమ్మెల్యేలు కేకేను ఆదర్శంగా తీసుకోవాలి : కేఆర్ సురేశ్‌రెడ్డి**

ఒక పార్టీపై గెలిచి మరో పార్టీలో చేరడం సరి కాదని భావించి, ఇంకా సమయం ఉన్నా తన ఎంపీ పదవికి రాజీనామా చేసిన కే కేశవరావును రాష్ట్రంలో పార్టీ మారిన ఎమ్మెల్యేలు ఆదర్శంగా తీసుకోవాలని బీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కేఆర్ సురేశ్‌రెడ్డి సూచించారు. ఫిర్యాదు విషయంలో ఆలోచిస్తున్న సమయంలో రాజీనామా చేసి తాను చట్టానికి బద్ధుడనని కేశవరావు నిరూపించుకున్నారని చెప్పారు. ఇదొక మంచి సంప్రదాయమని కొనియాడారు. పార్టీ మారితే సభ్యత్వం రద్దు అవుతుందని పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం చాలా స్పష్టంగా పేర్కొన్నదని గుర్తుచేశారు. ఫిర్యాదు అందిన తరువాత ఆ దిశగా సభాపతి నిర్ణయం తీసుకోవాలని చట్టం చెప్తున్నదని, అలా కాని పక్షంలో రాజ్యాంగంలోని 142 సెక్షన్ కింద సుప్రీంకోర్టు ఆ సభ్యత్వాన్ని రద్దు చేయొచ్చని తీర్పులు ఉన్నాయని వివరించారు.

### మూడుసార్లు ఎంపీ

బీఆర్‌ఎస్ నుంచి రాజ్యసభకు ఎన్నికైన కే కేశవరావు బుధవారం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన తెల్లారే ఎంపీ పదవికి రాజీనామా చేశారు. తన పదవీకాలం దాదాపు రెండేండ్లు ఉండగానే రాజీనామా చేయడం గమనార్హం. ఆయన ఇప్పటివరకు మూడుసార్లు ఎంపీగా పనిచేశారు.

- మొదటిసారి ఎంపీ : 2006 ఏప్రిల్ 3 నుంచి 2012 ఏప్రిల్ 2 వరకు
- రెండోసారి ఎంపీ: 2014 ఏప్రిల్ 10 నుంచి 2020 ఏప్రిల్ 9 వరకు
- మూడోసారి ఎంపీ: 2020 ఏప్రిల్ 10 నుంచి 2026 ఏప్రిల్ 9 వరకు

# ఆరుగురు ఎమ్మెల్యేల రాజీనామా ఎప్పుడు?

- కేకే రాజీనామాను స్వాగతిస్తున్నం
- రాజ్యాంగ స్ఫూర్తికి రాహుల్‌గాంధీ మంగళం
- పార్టీ మారిన ఎమ్మెల్యేలతో రిజైన్ చేయించాలి
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్
- కేకే రాజీనామాతో ఇరకాటంలో ఎమ్మెల్యేలు



హైదరాబాద్, జూలై 4 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్‌లో చేరిన తర్వాత సీనియర్ నేత కే కేశవరావు (కేకే) తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేయడాన్ని స్వాగతిస్తున్నామని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. మరి, పార్టీ ఫిరాయించిన ఆ ఆరుగురు ఎమ్మెల్యేల సంగతేంటని 'ఎక్స్' వేదికగా కాంగ్రెస్ పార్టీని ప్రశ్నించారు. రాజ్యాంగం గురించి పదేపదే మాట్లాడే రాహుల్‌గాంధీ, దానిని నిలబెట్టడంలో విఫలమయ్యారని దుయ్యబట్టారు. ఇతర పార్టీల్లో గెలిచిన వారిని చేర్చుకుంటూ రాజ్యాంగ స్ఫూర్తిని తుంగలో తొక్కుతున్నారని మండిపడ్డారు. మ్యానిఫెస్టోకు విరుద్ధంగా బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లో చేర్చుకుంటున్న రాహుల్‌గాంధీ.. ఫిరాయింపులను అరికడతామంటూ చెప్తున్న మాటలను దేశం ఎలా నమ్ముతుందని ప్రశ్నించారు. మ్యానిఫెస్టోపై రాహుల్‌కు ఏమాత్రం నమ్మకం ఉన్నా కాంగ్రెస్‌లో చేరిన ఆరుగురు ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

**ఎమ్మెల్యేలను ఇరకాటంలో పెట్టిన కేకే**

కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్న తెల్లారే సీనియర్ నేత కే కేశవరావు (కేకే) తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసి తాను ఆదర్శనేతనని చెప్పకనే చెప్పారు. చట్టంపై తనకున్న గౌరవాన్ని చాటుకున్నారు. ఈ నేపథ్యంలో బీఆర్‌ఎస్‌ను వీడి హస్తం గూటికి చేరిన ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి, పోచారం శ్రీనివాసరెడ్డి, తెల్లం వెంకట్రావు, కాలె యాదయ్య, డాక్టర్ సంజయ్ సంగతేంటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అనర్హత వేటు పడడానికి ముందే వీరితోనూ పార్టీ రాజీనామా చేయిస్తుందా? లేదా? అన్న చర్చ ఇప్పుడు రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతున్నది. తమది జాతీయ పార్టీ అని, రాష్ట్రానికో విధానం ఉండదని గొప్పలకు పోయే కాంగ్రెస్ పార్టీ కేకే బాటలోనే ఆ ఆరుగురు ఎమ్మెల్యేలను నడిపిస్తుందా? అన్నది చర్చనీయాంశమైంది. అసెంబ్లీలో సంఖ్యా బలాన్ని చూసుకుని కేకేతో రాజీనామా చేయించిన కాంగ్రెస్.. ఎమ్మెల్యేల విషయంలోనూ ఇలాగే ముందుకెళ్లి ప్రజాతీర్పును కోరాలన్న డిమాండ్ వినిపిస్తున్నది.

**నియోజకవర్గాల్లో వ్యతిరేకత**


పార్టీ మారిన ఎమ్మెల్యేలపై ప్రజల్లో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. బీఆర్‌ఎస్ నుంచి తమ పార్టీలోకి వచ్చిన ఎమ్మెల్యేలను ఆయా నియోజకవర్గాల్లోని కాంగ్రెస్ శ్రేణులు కూడా ఓన్ చేసుకోలేకపోతున్నాయి. ఇప్పుడున్న పరిస్థితుల్లో పార్టీలో చేరిన ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి ఎన్నికలకు సిద్ధపడే సాహసం కాంగ్రెస్ చేస్తుందా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. మరోవైపు, వారిపై అనర్హత వేటు పడేవరకు పోరాడాలని బీఆర్‌ఎస్ గట్టి పట్టుదలగా ఉంది. అవసరమైతే సుప్రీంకోర్టుకు వెళ్లాలని యోచిస్తున్నది.

**కేకేకు ఓ నీతి.. ఎమ్మెల్యేలకు మరో నీతా?**

పార్టీలో చేరిన మర్నాడే కేకేతో రాజీనామా చేయించిన కాంగ్రెస్.. ఎమ్మెల్యేల విషయంలో అలా ఎందుకు చేయడం లేదన్న ప్రశ్న వినిపిస్తున్నది. లోక్‌సభ ఎన్నికలు ముగిసిన వెంటనే బీఆర్‌ఎస్ పార్టీ ఖాళీ అవుతుందని, మూడింటి రెండొంతుల మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరితే పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం వర్తించదని, వారంతా అప్పుడు చట్టబద్ధంగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అవుతారని ఫిరాయింపు ఎమ్మెల్యేలకు నమ్మబలికింది. ఆ నమ్మకంతోనే పార్టీలో చేరిన ఎమ్మెల్యేల పరిస్థితి కేకే వ్యవహారంతో కుడితిలో పడ్డ ఎలుకలా తయారైంది. తమపై అనర్హత వేటు పడితే పరిస్థితి ఏంటోనన్న ఆందోళన ఆ ఆరుగురు ఎమ్మెల్యేల్లో నెలకొన్నది. పార్టీ మారిన ఎమ్మెల్యే పరిస్థితి ఒకలా ఉంటే, మరోవైపు కాంగ్రెస్‌లో చేరిన కేకేను ఎవరు రాజీనామా చేయమన్నారన్న చర్చ రాజకీయ వర్గాల్లో మొదలైంది. ప్రస్తుత పరిస్థితుల్లో తమపై ఒకవేళ వేటు పడితే ఇటు ప్రభుత్వ వ్యతిరేకతతోపాటు అటు సొంత నియోజకవర్గంలోనూ ప్రజల నుంచి ఛీత్కారాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఫిరాయింపు ఎమ్మెల్యేలు ఆందోళన చెందుతున్నారు. అదే జరిగితే తమ పరిస్థితి రెంటికీ చెడ్డ రేవడిలా తయారవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# అభిషేక్ సింఘ్వీకి కేకే సీటు?

- ఇంకా రెండేండ్లు ఉన్న కేకే పదవీకాలం
- సింఘ్వీకి కలిసొచ్చిన కేకే రాజీనామా
- ప్రభుత్వ సలహాదారుడిగా కేశవరావు!



హైదరాబాద్, జూలై 4 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీలో చేరిన కే కేశవరావు (కేకే) తన రాజ్యసభ సభ్యత్వానికి గురువారం రాజీనామా చేయడంతో ఆ సీటు ఎవరికి ఇస్తారన్న చర్చ అప్పుడే మొదలైంది. కేకే పదవీకాలం ముగిసేందుకు ఇంకా రెండేండ్ల సమయం ఉన్నది. దీంతో పీసీసీ చీఫ్ పదవి ఆశించి భంగపడిన నేతలు, ఎంపీ ఎన్నికల్లో టికెట్ దక్కని సీనియర్ నాయకులు ఆ సీటుపై ఆశలు పెట్టుకున్నారు. అయితే, వీరి ఆశలు నెరవేరేలా కనిపించడం లేదు. సుప్రీంకోర్టు ప్రముఖ న్యాయవాది, ఏఐసీసీ అధికార ప్రతినిధి అభిషేక్ మనుసింఘ్వీకి ఆ సీటు ఇవ్వాలని కాంగ్రెస్ అధిష్ఠానం ఇప్పటికే ఓ నిర్ణయానికి వచ్చినట్టు తెలిసింది.

**కేకే రూపంలో కలిసొచ్చిన అదృష్టం**

హిమాచల్‌ప్రదేశ్‌లో ఖాళీ అయిన రాజ్యసభ స్థానానికి ఫిబ్రవరిలో జరిగిన ఎన్నికల్లో సింఘ్వీ ఓటమి పాలయ్యారు. దీంతో ఆయనను మరెక్కడి నుంచైనా రాజ్యసభకు పంపాలని అధిష్ఠానం యోచిస్తున్నది. ఇప్పుడు కేకే రూపంలో సింఘ్వీకి అదృష్టం కలిసొచ్చింది. రాజ్యసభ పదవికి రాజీనామా చేశాకే కేకే పార్టీలో చేరుతారన్న సమాచారం నెల కిందటే కాంగ్రెస్ అధిష్ఠానానికి చేరింది. దీంతో ఆ స్థానాన్ని అభిషేక్ సింఘ్వీకి ఇవ్వాలని అప్పుడే కాంగ్రెస్ పెద్దలు ఓ నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం.

**కేకేకు ప్రభుత్వ సలహాదారు పదవి**

కాంగ్రెస్‌లో చేరిన సీనియర్ నేత కేకేకు క్యాబినెట్ హోదాతో ప్రభుత్వ ప్రత్యేక సలహాదారు పదవి ఇవ్వనున్నట్టు గురువారం ఢిల్లీలో జరిగిన మీడియా చిట్‌చాట్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచన ప్రాయంగా వెల్లడించారు.

**ఖర్గే కంటే నేనే సీనియర్: కేకే**

కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కంటే తానే సీనియర్‌నని కేకే వ్యాఖ్యానించారు. ఢిల్లీలో ఉన్న రేవంత్‌రెడ్డి గురువారం సాయంత్రం కేకే నివాసానికి వెళ్లారు. అనంతరం రేవంత్‌తో కలిసి మీడియాతో మాట్లాడిన కేకే ఈ వ్యాఖ్యలు చేశారు. తాను బీఆర్‌ఎస్ తరఫున రాజ్యసభకు వెళ్లడంతో పదవికి రాజీనామా చేసినట్టు తెలిపారు. తాను మొదటి నుంచి కాంగ్రెస్ వ్యక్తినేనని, ఆ మాట కొస్తే పార్టీ అధ్యక్షుడు ఖర్గే కంటే తానే రెండేండ్ల సీనియర్‌నని చెప్పుకొచ్చారు. సోనియాగాంధీ, కాంగ్రెస్ ఎంపీల పోరాటం కారణంగానే తెలంగాణ వచ్చిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ ఆరు నెలల పాలన వాస్తవిక దృక్పథంతో, ప్రజాస్వామ్యయుతంగా అభివృద్ధిపథంలో సాగుతున్నదని కితాబిచ్చారు. తన సేవలను ఏ విధంగా వినియోగించుకుంటారన్నది పార్టీ నిర్ణయమని పేర్కొన్నారు. కాంగ్రెస్‌లో చేరాక స్వేచ్ఛా వాయువులు పీల్చుకుంటున్నట్టు చెప్పారు.

**రాజ్యసభ సభ్యత్వానికి కేకే రాజీనామా**

కేకే తన రాజ్యసభ సభ్యత్వానికి గురువారం రాజీనామా చేశారు. రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్కడ్‌ను కలిసి స్వయంగా రాజీనామా లేఖ అందించారు. ఒకపార్టీ నుంచి పదవి పొంది మరో పార్టీలో చేరినప్పుడు రాజీనామా చేయడం నైతిక బాధ్యత అని ఈ సందర్భంగా పేర్కొన్నారు. అందుకే రాజీనామా చేసినట్టు కేకే వివరించారు.

### రాజకీయ కక్షతోనే ఆరోపణలు

- ట్యాపింగ్‌తో సంబంధం లేదు
- ఆరోపణలు అవాస్తవమని నిరూపిస్తా
- బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ నవీన్‌కుమార్



హైదరాబాద్, జూలై 4 (నమస్తే తెలంగాణ): ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంతో తనకు సంబంధం లేదని, తనపై దుష్ప్రచారాన్ని ఖండిస్తున్నానని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కే నవీన్‌కుమార్ తెలిపారు. ఆరోపణలు అవాస్తవమని నిరూపించేందుకు సిద్ధంగా ఉన్నట్టు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రణీత్‌రావు, శ్రవణ్‌రావుతో తనకు కనీస పరిచయాలు కూడా లేవని, తాను ఏనాడు వారితో ఫోన్లో మాట్లాడిన సందర్భాలు లేవని తెలిపారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులతో ఫంక్షన్లలోనో, ఇంకెక్కడో మర్యాదపూర్వకంగా మాట్లాడి ఉంటానే తప్ప ఇతర విషయాల్లో జోక్యం చేసుకోలేదని పేర్కొన్నారు. రాజకీయ కక్షసాధింపులో భాగంగానే కొందరు తన పేరు ఇరికించే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు.



నిజామాబాద్ జిల్లా బాల్కొండలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి


## అమలయ్యేది ఉచిత బస్సు ఒక్కటే

- మిగతా హామీల సంగతేంటి?
- బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశ్న

బాల్కొండ, జూలై 4: వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు, ఇతర హామీలు అమలు చేస్తామని చెప్పి.. ఉచిత బస్సు తప్ప ఇతర ఏ హామీ కూడా సక్రమంగా అమలు చేయడలేదని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు. జడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీల పదవీకాలం ముగింపు సందర్భంగా నిజామాబాద్ జిల్లా బాల్కొండలోని క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన వారిని సన్మానించారు. ఈ సందర్భంగా వేముల మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్‌పై కాంగ్రెస్ చేస్తున్నవన్నీ తప్పుడు ఆరోపణలని ఆయన కొట్టిపారేశారు. 'ఏ గుడి మెట్లు అయిన ఎక్కుదామని, మీరు చేసిన ఆరోపణలు రుజువు చేయగలరా?' అని సవాల్ విసిరారు. కల్యాణలక్ష్మి, సీఎంఆర్‌ఎఫ్ కోసం అధికార పార్టీ నాయకులు డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ హయాంలో 70 శాతం రైతులకు రుణమాఫీ చేశామని, మిగిలిన వారు మళ్లీ కొత్తగా తీసుకున్న వారి డాటా ప్రభుత్వం దగ్గర ఉంటుందని, కానీ వారికి రూ.2లక్షల రుణమాఫీ చేయకుండా విధివిధానాలు అనడం హాస్యాస్పదమని అన్నారు. రైతుబంధు సక్రమంగా ఇవ్వడం లేదని, ఊరూరా మీటింగ్‌లు పెట్టి రైతుబంధులో కోతలు విధించే పనులు చేస్తున్నారని మండిపడ్డారు.

**పోచారం పార్టీ మారడం సరికాదు**

సుదీర్ఘ అనుభవమున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి పార్టీ మారడం సరికాదని ఎమ్మెల్యే వేముల అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ ఆయనకు ఉన్నతమైన స్థానాన్ని కల్పించిందని, అయినా నాలుగు రోజులు కూడా అధికారం లేకుండా ఉండలేకపోయారని విమర్శించారు. ఎవరి ఒత్తిడితోనో, తాత్కాలిక లబ్ధి కోసమో పార్టీని వీడటంతో జిల్లా ప్రజలు ఈసడించుకుంటున్నారని తెలిపారు. ప్రజల పక్షాన పోరాడేందుకు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.



జనగామలో దొడ్డి కొమురయ్య విగ్రహావిష్కరణ అనంతరం కోమటిరెడ్డి, పల్లా నినాదాలు

## ట్యాంక్‌బండ్‌పై కొమురయ్య కాంస్య విగ్రహం

- ఏప్రిల్ 3న అధికారిక జయంతి
- జనగామలో రెండెకరాల్లో భవనం
- కొమురయ్య వర్ధంతి సభలో మంత్రి కోమటిరెడ్డి ప్రకటన

జనగామ, జూలై 4 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య కాంస్య విగ్రహాన్ని హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయించి, ఏప్రిల్ 3న అధికారికంగా ఆయన జయంతి నిర్వహిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. గురువారం జనగామ జిల్లా కేంద్రంలోని కల్లెంరోడ్డు జంక్షన్ వద్ద దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమున, పాశం యాదగిరి, విమలక్కతో కలిసి ఆవిష్కరించారు. కురుమ సంఘం అధ్యక్షుడు కంచ రాములు అధ్యక్షతన జరిగిన కొమురయ్య 78వ వర్ధంతి సభలో మంత్రి మాట్లాడారు. జనగామలో స్మారక భవన నిర్మాణం కోసం 2 ఎకరాలు కేటాయిస్తామని తెలిపారు.

# ఏడు మండలాలు తిరిగివ్వాలి

- రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాలి
- విలువైన ఆస్తులపై ఏపీ కన్ను
- వ్యక్తిగత సంబంధాలు వదిలి విభజన సమస్యలు పరిష్కరించాలి
- ఇరు రాష్ట్రాల సీఎంల భేటీపై మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



హైదరాబాద్, జూలై 4 (నమస్తే తెలంగాణ) : విభజన సమస్యలపై ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రుల భేటీ సందర్భంగా తెలంగాణ ప్రయోజనాలను కాపాడేలా సీఎం రేవంత్‌రెడ్డి చర్చలు జరపాలని, వ్యక్తిగత సంబంధాలను పక్కన బెట్టి సమస్యల పరిష్కారానికి కృషి చే యాలని మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ సూ చించారు. తెలంగాణ భవన్‌లో గురువారం ఆ యన మీడియా సమావేశంలో మాట్లాడుతూ చంద్రబాబు, రేవంత్‌రెడ్డి మధ్య గత సంబంధాల నేపథ్యంలో ప్రజలకు అపోహలున్నాయ ని, రేవంత్‌రెడ్డి తెలంగాణకు రక్షణకవచంలా ఉండి చర్చలు జరపాలని కోరారు. తెలంగాణ ప్రయోజనాల కోసమే బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేండ్లు పనిచేసిందని చెప్పారు. ఎన్డీయే కూటమిలో చంద్రబాబు కీలకంగా ఉన్నారని, విభజన సమస్యల పరిష్కారానికి ఆయన చొరవ తీసుకోవాలని కోరారు. ఏడు మండలాలను ఏపీలో కలపడంతో భద్రాచలంలో వాహన పార్కింగ్‌కు, డంపింగ్ యార్డ్‌కు స్థలం లేకుండాపోయిందని తెలిపారు. రాష్ట్రం ఏర్పడిన కొత్తలోనే ఏడు మండలాలను ఆంధ్రాలో కలిపారని, అప్పుడు ఆంధ్రాలో కలిపితే తప్ప తాను బాధ్యతలు తీసుకోను అని చంద్రబాబు చెప్పారని, తిరిగి ఆ మండలాలను తెలంగాణకు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

**'దిల్' భూములపై ఏపీ నజర్**

కృష్ణా, గోదావరి నదుల్లో రాష్ట్రాలకు రావాల్సిన వాటా కోసం కేంద్రంపై ఒత్తిడి తేవాలని శ్రీనివాస్‌గౌడ్ సూచించారు. జిల్లా కార్యాలయాల్లోనూ వాటా కోసం ఏపీ వితండవాదం చేయడం కరెక్ట్ కాదని, ఆస్తులు, ఆర్టీసీ, దిల్ వంటి సంస్థలపై విభజన హామీలు పక్కాగా అమలు కావాలని కోరుకుంటున్నట్టు చెప్పారు. హైదరాబాద్ చుట్టుపక్కల విలువైన ఆస్తులున్నాయి కాబట్టే ఏపీ కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. దిల్ అనే సంస్థకు చెందిన ఐదువేల ఎకరాల భూమిపై ఏపీ కన్నువేసిందని ఆరోపించారు. ఇక్కడి ఆస్తులపై ఏపీ వాటా అడుగుతున్నదని, విజయవాడ, తిరుపతిలో మనం వాటా ఇవ్వాలని అడుగుతున్నామా? అని ప్రశ్నించారు. విద్యుత్ సంస్థల బకాయిలను కూడా ఏపీ అడుగుతున్నదని చెప్పారు.